నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 18 మార్చి 2024 | NIZAMABAD

నిజామాబాద్ జిల్లాలో 6058 ఎకరాల్లో పంట నష్టం

ఖలీల్‌వాడి,మార్చి 17: నిజామాబాద్ జిల్లాలో శనివారం కురిసిన అకాల వర్షానికి జిల్లా వ్యాప్తంగా 3076 మంది రైతులకు చెందిన 6058 ఎకారాల్లో పంట దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.బాల్కొండ, మెండోరా మండలాల్లోని 64 ఎకరాల్లో పంట దెబ్బ దినగా.. 80 మంది రైతులు నష్టపోయారు. బాన్సువాడ, వర్ని మండలాల్లోని రెండు గ్రామాల్లో 118 ఎకరాల్లో పంట దెబ్బతినగా 95 మంది రైతులకు నష్టం వాటిల్లింది.జిల్లా వ్యాప్తంగా 44 గ్రామాల్లో 6058 ఎకరాల్లో పంట నష్టం సంభవించగా..3076 మంది రైతులు నష్టపోయారు. ఇందులో 5661 ఎకరాల్లో వరి (2812 మంది రైతులు), 292 ఎకరాల్లో మక్కజొన్న(169), 93 ఎకరాల్లో జొన్న (80 మంది రైతులు), 12 ఎకరాల్లో నువ్వుల (15 మంది రైతులు) పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

రాజంపేట్ మండలం బస్వన్నపల్లిలో నేలకొరిగిన మక్కజొన్న


మాక్లూర్ మండలం మాదాపూర్‌లో నేల రాలిన మామిడికాయలు

కామారెడ్డి జిల్లాలో 20,071 ఎకరాల్లో పంట నష్టం

కామారెడ్డి, మార్చి 17: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి 20,071 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 130 గ్రామాల్లో 14,553 మంది రైతుల చెందిన పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రధానంగా వరి, మక్కజొన్న, జొన్న పంటలతోపాటు కొత్తిమీర, గోధుమ, ఉల్లి, బోప్పాయి, మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారుల నుంచి వచ్చిన తాత్కాలిక అంచనా నివేదిక మేరకు వరి ధాన్యం 16,298 ఎకరాలు, మక్క జొన్న 2,784, జొన్న 705 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని, నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. నిజాంసాగర్, బీబీపేట, రాజంపేట,బాన్సువాడ, డోంగ్లీ, దోమకొండ, భిక్కనూర్ తదితర మండలాల్లో జొన్న, వరి, మక్కజొన్న పంటలు నేలవాలాయి. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, తిప్పాపూర్, రామేశ్వర్ పల్లి ,జంగంపల్లి తదితర గ్రామాల్లో పెద్ద మొత్తంలో పంటలకు నష్టం వాటిల్లగా.. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఆదివారం పరిశీలించారు.

- ఉమ్మడి జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం
- నిజామాబాద్ జిల్లాలో 6058 ఎకరాలు, కామారెడ్డిలో 20,071 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యేలు, అధికారులు
- ఆదుకోవాలని కోరుతున్న రైతన్నలు

వడగండ్లు.. కడగండ్లు..

అన్నదాతను ఆగం చేసిన అకాల వర్షం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అభయహస్తం కాలనీలో నిలిచిన వర్షపునీరు

డిచ్‌పల్లిలో దెబ్బతిన్న పంట

బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ శివారులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

రాజంపేట్ మండలం అర్గొండ సబ్‌స్టేషన్ పరిధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

బోధన్ డివిజన్‌లో..
మండలాలు: బోధన్ , సాలూర, ఎడపల్లి
గ్రామాలు: 12
నష్టపోయిన రైతులు: 548
పంట నష్టం ఎకరాలు: 1151

నిజామాబాద్ డివిజన్‌లో..
మండలాలు: ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, రూరల్, సిరికొండ
గ్రామాలు: 29
నష్టపోయిన రైతులు: 2353
పంట నష్టం ఎకరాలు: 4725

ఉమ్మడి జిల్లాలో శనివారం కురిసిన అకాల వర్షం అన్నదాతలను ఆగం చేసింది. పలు మండలాల్లో వడగండ్ల వాన కురవగా పెద్దమొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అభయహస్తం కాలనీలోని గుడిసెలు కూలిపోయాయి. పలు మండలాల్లోని ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులకు చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టంతోపాటు మామిడికాయలు నేలరాలాయి. కోటగిరి మండలంలో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయాధికారులు ఆదివారం పరిశీలించారు. వర్ని మండలంలోని సిద్దాపూర్, పైడిమల్, జలాల్‌పూర్ గ్రామ శివారులోని మక్కజొన్న పంట నేలకొరిగింది.

కొప్పర్తి క్యాంపు శివారులో దెబ్బతిన్న మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతిన్న బొప్పాయి పంట

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, మార్చి 17: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.బీర్కూర్ మండలం చించోల్లి, కిష్టాపూర్, అన్నారం గ్రామాల పరిధిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఓదార్చారు. పంట నష్టంపై కామారెడ్డి, నిజామాబాద్ కలెక్టర్లకు ఫోన్ చేసి వివరించారు. నష్ట పోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరారు. రెవెన్యూ,వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికను పంపించాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గంలో వరి ధాన్యం కోతలు మొదలయ్యాయి, వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భిక్కనూర్ మండలం అంతంపల్లిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి జిల్లా బీర్కూర్ గ్రామశివారులో ఈదురుగాలులకు ఎగిరిపోయిన అన్నపూర్ణ రైస్‌మిల్ పైకప్పు

కోడ్ ఉల్లంఘించొద్దు..

సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్

కంఠేశ్వర్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిచర్యలు చేపట్టామని నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, మే 13న పోలింగ్, జూన్ 4న డిచ్‌పల్లి సీఎంసీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. గతంలో జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్లనే ఇక్కడ లెక్కించారని, ఈసారి మాత్రం నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లన్నీ ఒకేచోట లెక్కిస్తామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీసీ సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచుతుందన్నారు. 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచి ఓటు వేసేలా వెసులుబాటు ఉందన్నారు. సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీస్ బలగాలతోపాటు ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. జిల్లాలో మొత్తం 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించిన నగదుతో ప్రయాణించొద్దని, తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రయినీ ఐఏఎస్ కిరణ్మయి, ట్రయినీ ఐపీఎస్ చైతన్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 28లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ప్రారంభించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఆల్ ది బెస్ట్

నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ఉమ్మడి జిల్లాలో హాజరుకానున్న 34,243 మంది విద్యార్థులు

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మార్చి 17: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించేందుకు పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుండగా ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 11,962 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో 5,834 మంది బాలురు, 6128 మంది బాలికలు ఉన్నారు. 62 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఆరు గురు రూట్ ఆఫీసర్లు, 16 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 662 మంది ఇన్విజిలేటర్లతోపాటు 62 మంది చీఫ్ సూపరింటెండెంట్స్ తదితరులు పర్యవేక్షిస్తారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 22,281 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, 141 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో దుర్గా ప్రసాద్ తెలిపారు. పరీక్షల పర్యవేక్షణకు 141 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 7 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, 9.35 గంటల వరకు అనుమతిస్తామన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చినట్లు వెల్లడించారు.

వైభవంగా శ్రీకాళి కళ్యాణం

బీర్కూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.
– నస్రుల్లాబాద్, మార్చి 17

కోడ్ కూసింది.. ముసుగు పడింది

ఎన్నికల కమిషన్ పార్లమెంటు ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించడంతో అధికారులు కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కూడళ్ల వద్ద ఉన్న ఎన్టీఆర్, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు ముసుగులు వేశారు. పలుచోట్ల పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

తాత్కాలికంగా ప్రజావాణి రద్దు

కామారెడ్డి,మార్చి 17: లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.